క్లుప్తంగా

సాయినాథునికి ప్రత్యేక పూజలు



ధవళేశ్వరం: పౌర్ణమి సందర్భంగా ధవళేశ్వరం సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం బాబా వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. మధ్యాహ్నం పేదలకు అన్నదానం చేశారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ



ఆటో డ్రైవర్లకు యూనిఫాం అందజేస్తున్న థామస్

సీటీఆర్ఐ: దహించు అగ్ని మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు డాక్టర్ థామస్ మాతృమూర్తి సంస్మరణార్థం గురువారం స్థానిక దహించు అగ్ని చర్చిలో 500 మంది ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ చేశారు. థామస్ మాట్లాడుతూ తన తల్లి సెల్వమ్ సంస్మరణార్థం గతేడాది సీతానగరం మండలం కాటవరం గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది ఆటో డ్రైవర్లకు యూనిఫాం అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమములో గిన్నిస్ రికార్డు గ్రహీత పాస్టర్ జయశీలన్ కృపా జయశీలన్, షీబా థామస్ పాల్గొన్నారు.

హోంగార్డు భార్యకు ఉద్యోగం



దేవికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు: హోంగార్డుల కుటుంబాలకు, పోలీసు సిబ్బందికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. నగరంలో హోంగార్డుగా పనిచేసే కె.నాగ సురేంద్ర ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య దేవికి హోంగార్డుగా ఉద్యోగం ఇచ్చారు. ఆ నియామక పత్రాన్ని గురువారం దేవికి ఎస్పీ జగదీష్ అందజేశారు. అలాగే జిల్లా హోంగార్డు యూనిట్ తరపున హోంగార్డుల ఒకరోజు జీతం రూ.1.63 లక్షలను అందించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తామని, మనం అందరం పోలీసు కుటుంబమన్నారు.

ఘనంగా అన్నమాచార్యుల జయంతి



అన్నమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాకా సంస్థ సభ్యులు

సీటీఆర్ఐ: గోకవరం బస్టాండ్ సమీపంలోని ఎస్పీ బాలు స్మారక సంగీత మందిరంలో గురువారం తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాకా సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామిపై అనేక కీర్తనలు రాయడమే కాకుండా, వాటిని అత్యంత అద్భుతంగా ఆలపించిన పద కవితా పితామహుడు అన్నమయ్య అన్నారు. పండితులతో పాటు పామురులకు సైతం అర్థమయ్యే రీతిలో పదాలను అల్లి సాక్షాత్తూ వేంకటేశ్వరస్వామి కృపకు పాత్రుడయ్యారన్నారు. కార్యక్రమంలో కృష్ణ కుమార్, తోట సుబ్బారావు, భమిడిపాటి రామకృష్ణమూర్తి, జీవీ రమణ పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట చర్యలు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో వచ్చే నెల 4న నిర్వహించే ఓట్ల కౌంటింగ్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత గురువారం పరిశీలించారు. రాజమండ్రి రూరల్, అర్బన్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్‌రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలను, మీడియా విభాగం, కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించి, నోడల్ అధికారులకు సూచనలిచ్చారు. నిరంతర నిఘాలో భాగంగా కమాండ్ కంట్రోల్ కేంద్రంలో సీసీ టీవీలను ఏర్పాటు చేశారు. నిఘా వ్యవస్థ ద్వారా ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లను, ఇతర ముఖ్యమైన ప్రదేశాలను నిరంతరం పర్యవేక్షిస్తుంటారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. పోటీ చేసిన అభ్యర్థులు, వారికి సంబంధించిన ఏజెంట్లు కూడా ఈ సీసీ టీవీల ద్వారా కదలికలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల కూడా పోలీసు విభాగానికి చెందిన ఏడు సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.

పుచ్చకాయ.. రుచే వేరయా..

- వేసవిలో ఫుల్ డిమాండ్
- జోరుగా విక్రయాలు
- వేసవి తాపం నుంచి ఉపశమనం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు



పుచ్చకాయను ముక్కలుగా కోస్తున్న వ్యాపారి

రాజమహేంద్రవరం రూరల్: వేసవి నేపథ్యంలో భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఎండలు విపరీతంగా పెరిగిపోయాయి. మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. పెరిగిపోయిన ఉష్ణోగ్రతలతో చల్లటి పానీయాలు, పండ్ల రసాలు, పుచ్చకాయలకు డిమాండ్ పెరిగింది. అందుబాటు ధరలో దొరికే పుచ్చకాయలలో ఎన్నో పోషక గుణాలు ఉన్నాయి. మండుటెండల్లో ప్రయాణించే వారు పుచ్చకాయ ముక్క తింటే ఆ హాయి మాటల్లో వర్ణించలేనిది.

నోరూరిస్తూ..

ఎర్రని రంగులో, చూడగానే నోరూరించే పుచ్చకాయను ఇష్టపడని వారెవ్వరూ ఉండరనే చెప్పాలి. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ప్రధాన రహదారుల్లో తోపుడు బండ్లపైనా, చెట్ల కింద పుచ్చకాయల వ్యాపారం జోరుగా సాగుతోంది. అలాగే ద్విచక్ర వాహనాలపై చిరు వ్యాపారులు వీధుల్లో తిరుగుతూ వీటిని విక్రయిస్తున్నారు. ఈ ఏడాది పుచ్చకాయల ధర కాస్త ఎక్కువగానే ఉంది. ప్రస్తుతం టన్ను రూ.20 వేల నుంచి రూ. 22 వేల వరకూ పలుకుతోంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. జిల్లాలో పుచ్చకాయల సాగు తక్కువగా ఉంది. దీంతో చెన్నై తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

పెరిగిన దుకాణాలు

వేసవి నేపథ్యంలో పుచ్చకాయల దుకాణాలను విరివిరిగా ఏర్పాటు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి పుచ్చకాయలను దిగుమతి చేసుకొని గ్రామాల్లోనూ, ప్రధాన మార్గాల్లో విక్రయిస్తున్నారు. కాయలను కిలోల వంతున నేరుగా విక్రయించడంతో పాటు ముక్కలుగా కోసి కూడా అమ్ముతున్నారు. ఒక్కో ముక్కను సుమారు పది రూపాయాలకు విక్రయిస్తున్నారు. కొందరు చిన్న ముక్కలుగా కోసి కప్పుల్లో వేసి అమ్ముతుండగా, మరి కొందరు జ్యూస్ చేసి విక్రయిస్తున్నారు.

పోషక విలువలు

పుచ్చకాయలో విటమిన్ బి, పొటాషియం, ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. కొలెస్ట్రాల్ ఉండదు. వీటి వల్ల నిస్తేజితమైన శరీరానికి కొత్త శక్తి లభిస్తుంది. పుచ్చకాయలో 92 శాతం ఆల్కలైన్‌తో పాటు పీచు పదార్థం ఉండడం వల్ల శరీరానికి, మూత్రపిండాలకు, మూత్రనాళాలకు ఎంతో ఉపయోగకరం.

ప్రయోజనాలు

పుచ్చకాయ తినడం వల్ల మలబద్ధకం తగ్గుతుంది. దీనిలోని పీటాకెరోటిన్ రోగ నిరోధకశక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ సమస్యను నివారిస్తుంది. అలాగే అస్తమా, మధుమేహం, ఆర్థరైటీస్ సమస్యలకు ఉపశమనం కలిగిస్తుంది. రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది. అలాగే పుచ్చకాయ సౌందర్య సాధనంగా కూడా పని చేస్తుంది. 100 గ్రాముల పుచ్చకాయలో 91.45 గ్రాముల నీరు, 6 శాతం చక్కెర, 30 క్యాలరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6 గ్రాముల మాంసకృత్తులు, 12 గ్రాముల పొటాషియం, 7 గ్రాముల కాల్షియం, మిల్లీ గ్రాము సోడియం ఉంటాయి.

ఆరోగ్యమే మహా భాగ్యం



ఆరోగ్య జాగ్రత్తలను వివరిస్తున్న వైద్య సిబ్బంది

కడియం: ఆరోగ్యమే మహాభాగ్యమని, పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పలువురు వివరించారు. స్థానిక లైబ్రరీలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం చిన్నారులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో విద్యార్థులతో కథలను చదివించారు. స్థానిక వైద్య సిబ్బంది ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు.

ఆ తీర్పును స్వాగతిస్తున్నాం

రాజమహేంద్రవరం సిటీ: పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం ఇచ్చిన ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తూ కోల్‌కతా ప్రధాన న్యాయస్థానం ఇచ్చిన తీర్పును బీజేపీ ఓబీసీ మోర్చా స్వాగతిస్తోందని జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్ అన్నారు. ఈ తీర్పు మమతా బెనర్జీకి, కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టులాంటిదన్నారు. ఓట్ల కోసం ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తూ బీసీల అభివృద్ధిని మమతా బెనర్జీ నిర్వీర్యం చేశారన్నారు.

అక్రమ మద్యం, రికార్డులు లేని వాహనాల సీజ్



కార్డన్ అండ్ సెర్చ్‌కు సిద్ధమవుతున్న పోలీసులు

కంబాలచెరువు: జిల్లాలో గురువారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి అక్రమ మద్యం, రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, సారా నియంత్రణ, అసాంఘిక శక్తుల కార్యకలాపాలను అణిచివేసేందుకు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో జోనల్ డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది టీములుగా ఏర్పడి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ ఉంచిన 22 మద్యం సీసాలు, రికార్డులు, నంబర్ ప్లేట్లు లేని 64 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ప్రతి రోజూ ఈ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌కు పటిష్ట భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం రూరల్: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌కు పటిష్ట భద్రత ఉందని రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. ఆయన గురువారం సాయంత్రం తన చాంబర్‌లో ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై రాజకీయ పార్టీల అభ్యర్థులు, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎం యూనిట్లు, స్టాట్యూటరీ మెటీరియల్, పోస్టల్ బ్యాలెట్ పత్రాలను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచామన్నారు. పార్టీ అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో గదులకు సీల్ వేయడం జరిగిందన్నారు. ఆ గదుల డోర్లు, కిటికీలకు కూడా చెక్కలను కొట్టి మూసి ఉంచామన్నారు. ఓట్లు లెక్కించే జూన్ 4వ తేదీ ఉదయం 5 గంటలకు అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ల సమక్షంలో గదులను తెరుస్తామన్నారు. పరిశీలకుల సమక్షంలో ఉదయం 5.30 గంటలకు కౌంటింగ్ సిబ్బంది టేబుల్ ఎలాట్ మెంట్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటిని కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ చేస్తామన్నారు. అక్కడ అభ్యర్థులు, ఏజెంట్లు నిరంతరం పరిశీలించడం జరుగుతుందన్నారు. శుక్రవారం నుంచి అభ్యర్థులు, ఏజెంట్లు నేరుగా స్ట్రాంగ్‌రూమ్‌లను తనిఖీ చేసే అవకాశం ఉందని, ఆ మేరకు పోలీసు, గెజిటెడ్ అధికారి ఎస్కార్ట్‌తో పంపనున్నట్లు తెలియజేశారు. మూడు షిఫ్టులలో తహసీల్దార్లను నియమించామన్నారు. నియోజకవర్గంలో 3,033 పోస్టల్ బ్యాలెట్ పోలైనట్లు తెలిపారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

బుద్ధుడు చూపిన మార్గం అనుసరణీయం



బుద్ధుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కళాశాల సిబ్బంది



వేమగిరి కొండపై జరిగిన వేడుకల్లో పాల్గొన్న రాజశిఖామణి తదితరులు

సీటీఆర్ఐ: మానవులందరూ సుఖ శాంతులతో జీవనం కొనసాగించడానికి బుద్ధుని మార్గం అనుసరణీయమని ఎస్‌కేవీటీ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ, కళా గౌతమి సంయుక్త నిర్వహణలో గురువారం గౌతమ బుద్ధుని జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంజీవరావు మాట్లాడుతూ ప్రేమ, స్నేహం, దయా మార్గాలే విజయానికి సోపానాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబెల్ రాజబాబు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధుని సూక్తులు ఆచరణీయం

కడియం: యువతను సన్మార్గంలో నడిపించేందుకు బుద్ధుని సూక్తులు ఆచరణీయమని న్యూ మాంక్స్ కుంగ్ ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, విశ్రాంత ఎస్పీ డాక్టర్ కె.రాజశిఖామణి కోరారు. వేమగిరి కొండపైగల మైత్రేయ బుద్ధ విహార ధర్మధామంలో గురువారం బుద్ధ పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. విహార వ్యవస్థాపకుడు మహోదయ, డాక్టర్ రాజశిఖామణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అక్కడి 84 అడుగుల బుద్ధుని నిలువెత్తు విగ్రహానికి నివాళులర్పించారు. ఓఎన్జీసీ రాజమండ్రి అసెట్ పూర్వ అధికారి డీఎంఆర్ శేఖర్, ఆర్గనైజేషన్ గౌరవ చీఫ్ పాట్రన్ మేజర్ డాక్టర్ ఎం.రాజశేఖర్, ఆర్గనైజేషన్ యోగా అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ సీవీ ఫణి, బిహేవియర్ థెరపిస్టు డాక్టర్ శ్రీనిధి, కాకినాడ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, జగ్గంపేట టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు దారాపసురత్నం, ఎల్‌వి ప్రసాద్, మంత్రి బాబ్జీ, బత్రే కొండబాబు, దాసి వెంకట్రావు, కొంకి రమేష్, కెకె సంజీవరావు. విజయపాల్, జివి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో..

దివ్యాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బుద్ధపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. జిల్లా నాయకులు యర్రా ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ప్రొ. సుదర్శన్, ప్రజాగాయకుడు లాజర్, మహోదయ యాజరా, గవర సత్తిబాబు, యనమదల వేంకటేశ్వరరావు, బౌద్ధభిక్షువు బోధిహిన్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు దివ్యాంగులు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారు.

ఎన్నికల నిబంధనలు బేఖాతరు



కడియం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎంపీపీ పుట్టిన రోజు ఫ్లెక్సీ

కడియం: మండల కేంద్రమైన కడియంలో టీడీపీ, జనసేన నాయకులు ఎన్నికల నిబంధనలు గాలికొదిలేశారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా చోద్యం చూస్తూ ఊరుకోవడం మండలంలో చర్చనీయాంశమైంది. కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ పుట్టినరోజును పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయం, పంచాయతీ కార్యాలయాల్లోనే వేడుకలకు తెర తీశారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, మోటారు సైకిల్ ర్యాలీలు కూడా నిర్వహించారు. నేరుగా మండల పరిషత్ కార్యాలయం వద్దే ఫ్లెక్సీ పెట్టారు. టీడీపీ, జనసేన నాయకులతో పాటు, పలువురు ప్రభుత్వ సిబ్బంది కూడా ఈ వేడుకల్లో పాల్గొనడం గమనార్హం. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందును ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా పరిమితులతో కూడిన అనుమతులు మాత్రమే ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకుల కార్యక్రమాలకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ విధంగా అనుమతులు ఇచ్చారో సంబంధిత అధికారులకే తెలియాలి. ఇదిలా ఉండగా పలువురు దీనిపై సంబంధిత అధికారులను ఆరా తీయగా హడావుడిగా మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించారు.

దేశ ప్రజలను మోసం చేసిన ప్రధాని మోదీ



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్ర మోదీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా రైతులు, యువత, ప్రజలను మోసం చేశారని, ప్రజలు ఈ ఎన్నికల్లో బీజేపీ పాలనకు స్వస్తి పలికి ఇండియా కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవడం ఖాయమని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. మాజీ ఎంపీ హర్షకుమార్ కార్యాలయలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ప్రతిష్ఠించే మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని కొత్తపేటలో శిల్పి వడయార్ తయారు చేస్తున్నారన్నారు. ఆ పనులను పరిశీలించడానికి ఇక్కడకు వచ్చానన్నారు. మోదీ, అమిత్ షాలు ఎన్నికల ప్రసంగాల్లో ముస్లిం, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఎత్తేస్తామని ప్రజల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని, ఎలక్షన్ కమిషన్ అటువంటి వ్యాఖ్యలు చేయవద్దని సూచించినా వారి పరిస్థితిలో మార్పు రావడం లేదన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మత్తుల కోసం నగరంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ మెయిన్ రోడ్, బెస్త వీధి, రంగ్రీజుపేట, టౌన్ హాల్ రోడ్డు, సోమాలమ్మ టెంపుల్ ఏరియా, రౌతు తాతలు కల్యాణ మండపం, కంచుమర్తి వారి వీధి, ముతంగి వారి వీధి, రంభ ఊర్వశి టౌన్, మంగళవారపుపేట, డీలక్స్ సెంటర్, అనుశ్రీ థియేటర్ రోడ్డు, కొబ్బరికాయల మార్కెట్, గాంధీపార్క్ ఎదురుగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏరియా, టీటీడీ కళ్యాణ మండపం రోడ్, ఆదిత్య హాస్పిటల్, విజయ హాస్పిటల్, బొమ్మిరెడ్డి సుధా హాస్పిటల్, గానుగ వీధి, ధనలక్ష్మి స్ట్రీట్, ప్రకాష్ నగర్ రౌండ్ పార్క్, గాంధీపురం 2, గాంధీపురం 3, శ్యామల నగర్, జాగృతి బ్లడ్ బ్యాంక్, ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ ఏరియా, అఫీషియల్ కాలనీ, సాయిబాబా గుడి ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 6 నుంచి 8.30 వరకూ వీఎల్ పురం, వీఎల్‌పురం పార్క్ వీధులు, చైతన్య కాలేజ్ స్ట్రీట్, వీఎల్ పురం పెద్ద వీధి, ఆదర్శ హాస్పిటల్ రోడ్, చక్రధర్ హాస్పిటల్ ఏరియా, తిలక్ రోడ్డు, ఏవీ అప్పారావు స్ట్రీట్, మార్గాని ఎస్టేట్ రోడ్, మోరంపూడి, తిలక్ రోడ్, సత్యనారాయణ పురం, కోనేరుపేట, ఆల్ బ్యాంక్ కాలనీ, శ్రీనగర్, అమ్మ హాస్పిటల్ స్ట్రీట్, మోడల్ కాలనీ, శ్రీలక్ష్మి నగర్, గణేష్ నగర్, సాయి నగర్, బాపూజీ నగర్, గాదాలమ్మ నగర్, వెంకటగిరి, హుకుంపేట ప్రాంతాలలో విద్యుత్ ఉండదు..
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నేతాజీ టవర్స్, సాయి టవర్లు, ఆనాల వెంకట అప్పారావు రోడ్డు, జయశ్రీ గార్డెన్స్, షీలా నగర్, గోపాల్ నగర్ పుంత, శ్రీనివాస గార్డెన్స్, బైబిల్ ప్లేస్ రోడ్, కోకా భాస్కరమ్మ నగర్, మల్లిన నగర్‌లో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ కలిగే అంతరాయంతో జాంపేట, అన్నపూర్ణమ్మ పేట, అశోక థియేటర్ ఏరియా, లక్ష్మీవారపు పేట, కృష్ణానగర్ ఏరియాలో ప్రభావం ఉంటుంది.

పోలీసుల విస్తృత తనిఖీలు

ధవళేశ్వరం: స్థానిక కంచర్లలైన్‌లో దక్షిణ మండల డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ జరిపారు. ఈ సందర్భంగా అనుమానితుల వాహనాలను, వారి వివరాలను పరిశీలించారు. త్వరలో ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ జీవీ వినయ్ మోహన్ తెలిపారు. అనుమానితులు ఎవరైనా సంచరిస్తున్నట్లయితే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని ప్రజలు కోరారు.

సినిమాలు

శ్యామల	: ఆ ఒక్కటీ అడక్కు
సూర్యమినీ	: సిల్క్‌శారీ, డర్టీఫెలో
సూర్యప్యాలెస్	: ఫ్యూరియోసా
స్వామి	: కృష్ణమ్మ
శివజ్యోతి	: అంజలి మళ్లీ పుట్టింది
అనుశ్రీ	: ఫ్యూరియోసా
రాజా	: ఫ్యూరియోసా
ఊర్వశి	: బాక్
రంభ	: ఆ ఒక్కటీ అడక్కు
మేనక	: ప్రసన్నవదనం
అప్సర	: ఫ్యూరియోసా
కుమారి	: రాజు యాదవ్
నామవరం	
వీఎస్ మహల్	: ఫ్యూరియోసా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ఫ్యూరియోసా

అనుమతులు లేకుంటే కఠిన చర్యలు



సోడా పరిశ్రమలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా కూల్ డ్రింక్స్, సోడా పరిశ్రమలను నిర్వహిస్తే సంబంధిత యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. పిడింగొయ్యిలోని తేజానగర్‌లో ఫ్లాట్ 111లో నడుస్తున్న బ్లూవేల్ బేవరేజెస్ అనధికారిక సోడా, డ్రింక్స్ తయారీ యూనిట్‌లో గురువారం విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్, మెట్రాలజీ, రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. ఎస్పీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ బ్లూ వేల్ బేవరేజెస్ సంస్థ యజమాని చెక్క నవదుర్గాభవాని నిమ్మకాయ, ద్రాక్ష, ఆరెంజ్, బ్లూ బెర్రీ, పైనాపిల్ ఫ్లేవర్ సోడాలను చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా తయారు చేస్తూ గాజు సీసాలలో నిల్వ చేస్తున్నారన్నారు. దీనిపై కేసును నమోదు చేశామన్నారు. అలాగే గడువు ముగిసిన ఆర్టిఫీషియల్ ఫ్లేవర్లు దొరికినందున మరో కేసు బుక్ చేశామన్నారు. సదరు సంస్థ ప్యాకర్‌గా నమోదు కానందున, ఉత్పత్తులపై స్టాట్యూరీ డిక్లరేషన్ లేనందున, ధృవీకరించని తూకం యంత్రం ఉన్నందున కేసులు కట్టామన్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

కంబాలచెరువు: స్థానిక క్వారీ సెంటర్‌లో హోర్డింగ్‌కు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం జరిగింది. బర్మాకాలనీకి చెందిన శంకర్ (24) సెంట్రింగ్ పని చేస్తుంటాడు. అతడి ఏడాది క్రితం వివాహమైంది. నిత్యం మద్యం తాగుతూ ఉండే శంకర్‌కు ఇంటిలో గొడవలు జరుగుతుండేవి. ఇదిలా వుండగా ఫుల్‌గా మద్యం తాగిన శంకర్ హోర్డింగ్‌కు ఉరి వేసుకున్నాడు. దీన్ని చూసిన స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. వారు వచ్చి అతడిని కిందకు దింపి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి

సీతానగరం: మండలంలోని కూనవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లమోలు పాపారావు (63) బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన గతంలో పీఏసీఎస్ చైర్ పర్సన్‌గా పనిచేశారు. ప్రస్తుతం రైతు భరోసా చైర్మన్‌గా ఉన్నారు. ఆయన బుధవారం రాజమహేంద్రవరంలో ఉంటున్న పెద్ద కుమారుడి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి 2 గంటలకు గుండెపోటుగా ఉందని చెప్పి, వాంతులు చేసుకొని అపస్మారక స్థితికి వెళ్లారు. హుటాహుటీన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. స్వగ్రామమైన కూనవరానికి గురువారం ఉదయం మృతదేహాన్ని తరలించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు గుర్రాల కృష్ణారావు తదితరులు అంత్యక్రియలలో పాల్గొన్నారు.